- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
17-09-2026

సంపుటి : 01 సంచిక : 176 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE176 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

సౌదీపై హౌతీల దాడులు

- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. సౌదీ అరేబియాలోని కీలక సైనిక స్థావరాలు, చమురు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని హౌతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వెల్లడించాయి. తాజాగా మక్కా సమీపంలోకి దూసుకొచ్చిన డ్రోన్ను కూల్చివేసినట్లు ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికుల భద్రత తమకు 'రెడ్ లైన్'అని సౌదీ హెచ్చరించింది. మరోవైపు మక్కాను లక్ష్యంగా చేసుకున్నామన్న ఆరోపణలను హౌతీలు ఖండించారు. ఈ పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. సౌదీ భూభాగం, పౌరులు, కీలక మౌలిక వసతులపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఎర్ర సముద్రం--బాబ్ అల్ మండెబ్ జలసంధిలో నౌకాయాన భద్రతపై కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి.





రాబోయే మూడు రోజులు వర్షాలు!

- ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు
- మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 19న ములుగు, భద్రాద్రి, ఖమ్మంలో భారీ వానలు
- రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం
- ఉమ్మడి మహబూబ్నగర్లో అధిక లోటు
- మిర్యాలగూడలో 4.17 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్,
ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. 19న ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.మరోవైపు ప్రస్తుత సీజన్లో రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అధిక లోటు వర్షపాతం నెలకొన్నది. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అధికంగా 4.17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కేసీఆర్ భూదోపిడీపై విచారణ

రూ. లక్ష కోట్ల విలువైన భూమిని దోచారు

- ఆయన కుటుంబ ఆధీనంలో 440 ఎకరాలు
- విదేశీ ముఠాకు ధరణి పోర్టల్ ఇచ్చారు
- నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 30 రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలి
- సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్కు ఎలా బదిలీ అయ్యింది?
- రంగనాయక సాగర్లో హరీశ్రావు ఫామ్హౌస్ అక్రమమే
- మైహోం కంపెనీకి 2,300 ఎకరాలు ఎలా ఇచ్చారు?
- 22-Aలో 98,37,320 ఎకరాలు ఉండాల్సిందే
- లేకుంటే వాటికి రక్షణ ఉండదు : శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి



-హైదరాబాద్
ధరణి పోర్టల్ను అడ్డం పెట్టుకుని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు రూ. లక్ష కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చెప్పారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ, ఫారెస్టు, అసైన్డ్, ఇనాం, వివాదాల్లోని భూములు.... ఇలా కల్వకుంట్ల కుటుంబం వేటినీ వదిలిపెట్టలేదన్నారు. బుధవారం శాసనసభలో 22-ఏపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్రెడ్డి మాట్లాడారు. భూ రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంఘించి, భూములను కొల్లగొట్టారని చెప్పారు. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబం 440 ఎకరాల భూమిని ఆక్రమించిందన్నారు. అంత భూమి ఎలా వచ్చిందో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. చట్టాలను విధ్వంసం చేసి, పేదల భూములను లాక్కున్నారని చెప్పారు. -మిగతా 3 లో



లింగ సమానత్వంలో భారత్కు 131వ ర్యాంక్

- వరుసగా 16వసారి ఐస్లాండ్ టాప్
- 145 దేశాలపై డబ్ల్యూఈఎఫ్ నివేదిక
- ఆర్థిక రంగంలో 41.2 శాతం ప్యారిటీ
- రాజకీయ సాధికారతలో తగ్గిన స్కోర్
- మంత్రి పదవుల్లో మహిళలు 5.9 శాతమే
- సమానత్వానికి మరో 120 ఏళ్లు
- సీఈఓ పదవుల్లో 19.1 శాతమే మహిళలు

భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక

- అసురక్షితంగా దిశ మార్చడంతోనే ఘటన
- పాక్ దౌత్యాధికారికి సమన్లు
- పునరావృతం కాకుండా హెచ్చరిక
- 1991 ఒప్పందానికి విరుద్ధమన్న భారత్
- 2011లోనూ ఇలాంటి ఘటనే
- పాక్ నౌక తీరుపై తీవ్ర అభ్యంతరం





నేడే తెలంగాణ విమోచన దినోత్సవం

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్లో వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్
- పటేల్ సంకల్పంతోనే తెలంగాణ భారత యూనియన్లో విలీనం
- నిజాం మెడలు వంచిన ఘనత ఉక్కుమనిషిదే: ఎన్.రాంచందర్రావు
- పరేడ్ గ్రౌండ్స్లో ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం

హైదరాబాద్,
: తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టమైన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా జరగనుంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తదితరులు బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు కూడా వేడుకల్లో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతిక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వేడుకల్లో తెలంగాణ చరిత్ర, సంప్రదాయ కళలు, ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. -మిగతా 3 లో

టీ కాంగ్రెస్కు కొత్త ఇన్చార్జి!

రేపు ప్రకటన వెలువడే ఛాన్స్

- లండన్కు మీనాక్షి నటరాజన్
- ఢిల్లీకి పీసీసీ చీఫ్ మహేష్కుమార్ గౌడ్
- సంస్థాగత మార్పులపై కీలక చర్చలు
- కొత్త ఇన్చార్జి ఎంపికపై ఉత్కంఠ
- కాంగ్రెస్లో మారనున్న సమీకరణాలు
- ముందున్న మూడు ప్రధాన సవాళ్లు

హైదరాబాద్,
రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో ఎవరిని నియమించాలన్న దానిపై అధిష్టానం కసరత్తు తుది దశకు చేరినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈనెల 18న కొత్త ఇన్చార్జి పేరును ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. మీనాక్షి నటరాజన్ లండన్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్తున్నారు. దాదాపు పది నెలలు ఆమె అక్కడే ఉంటారు. సెప్టెంబర్ 21న లండన్ వెళ్లనున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో.. మహేష్కుమార్ గౌడ్ ఢిల్లీ బాట పట్టడం రాజకీయ -మిగతా 3 లో





పాస్పోర్ట్ ర్యాంకులో భారత్కు షాక్

- 73వ స్థానానికి పడిపోయిన భారత్
- ఏడాదిలో ఏడు స్థానాలు దిగజారిన వైనం
- టాప్లో యూఏఈ పాస్పోర్ట్
- 69కు పడిపోయిన మొబిలిటీ స్కోర్
- 25 దేశాలకు వీసా ఫ్రీ ప్రయాణం
- 129 దేశాలకు ముందస్తు వీసా తప్పనిసరి
- ర్యాంకింగ్స్పై కేంద్రం అభ్యంతరం



భారత్పై అమెరికా 100 శాతం సుంకం?

- రష్యా ఆంక్షల బిల్లుతో భారత్కు ముప్పు
- తుది ఓటింగ్కు అమెరికా ప్రతినిధుల సభ
- 241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
- సెనేట్లో ఇప్పటికే ఆమోదం
- ట్రంప్కు పెరగనున్న సుంకాల అధికారం
- ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
- బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు

చరిత్రలో తొలిసారి.. మక్కా నగరానికి హై అలర్ట్ జారీ

దుబాయ్: -16సెప్టెంబర్ (మహాప్రభ).
సౌదీ అరేబియాలోని పలు పట్టణాలకు హై అలర్ట్ జారీ చేశారు. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తన హెచ్చరికల్లో సౌదీ సివిల్ డిఫెన్స్ పేర్కొన్నది. పశ్చిమ తీరంలో ఉన్న నగరాలకు ఆ హెచ్చరిక జారీ చేశారు. ముస్లింల పవిత్ర నగరం మక్కాకు కూడా హై అలర్ జారీ చేశారు. జెద్దా, టైఫ్ ప్రభుత్వాలు కూడా హై అలర్ట్ జారీ చేసి, ఆ తర్వాత హెచ్చరికలను ఎత్తివేశారు. మక్కా నగరానికి వైమానిక దాడి హెచ్చరికలు చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి.ఇటీవల ఇరానీ మద్దతుతో హౌతీలు పదేపదే సౌదీని టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో ఆ హెచ్చరికలు జారీ చేశారు. మదీనాలో ఉన్న ప్రిన్స్ మొహమ్మద్ బిన్ అబ్దుల్లిజ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి సర్వీసులను బంద్ చేశారు.



యెమెన్ నుంచి హౌతీ మిలిటెంట్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేయడం వల్ల సౌదీలో 13 మంది గాయపడ్డారు. ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 911కి ఫోన్ చేయాలని సౌదీ సివిల్ డిఫెన్స్ డైరెక్టరేట్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నది. మొత్తం ఆరు ప్రదేశాల్లో స్వల్ప సమయం పాటు ఎయిర్ రెయిడ్ అలర్ట్లు జారీ చేసినట్లు సౌదీ రక్షణ శాఖ చెప్పింది. ఈ మధ్య కాలంలో హౌతీలు చేసిన దాడిలో సౌదీ అరేబియాలోని పలు ఆయిల్ కేంద్రాలు అంటుకున్నాయి. ఆ దాడుల్లో 73 మంది గాయపడ్డారు. యెమెన్లోని సౌదీ మద్దతు దళాలను కూడా హౌతీలు టార్గెట్ చేస్తున్నారు. సోమవారం జరిగిన దాడిలో 8 మంది సైనికులు మృతిచెందారు. ఎర్ర సముద్రంలోని నౌకలను కూడా హౌతీలు టార్గెట్ చేస్తున్నారు.

అరేబియా సముద్ర జలాల్లో ఢీకొన్న పాక్, భారత నౌకలు



న్యూఢిల్లీ: -16సెప్టెంబర్ (మహాప్రభ).
అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఇండో, పాక్ నౌకలు ఢీకొన్నాయి . ఈ ఘటనపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నౌకాదళ వ్యవహారం ఆమోదయోగ్యంగా లేదని, దాని ప్రవర్తన ప్రొఫెషనల్గా లేదని భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. భారతీయ నేవీ నౌకను పాక్ నేవీ నౌక ఢీకొన్నట్లు విదేశాంగ వర్గాలు తెలిపాయి. ఈ ఘటన అంతర్జాతీయ జలాల్లో జరిగినా, భారతీయ నౌకకు డ్యామేజ్ జరగలేదని, కానీ పాకిస్థాన్ నౌకాదళ ప్రవర్తన సరిగా లేదని భారత్ పేర్కొన్నది.1991 నాటి నౌకావిన్యాసాల అగ్రిమెంట్లోని ఆర్టికల్ 10 ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకనలో తెలిపింది. గత రాత్రి అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగినట్లు విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థానీ విదేశాంగ శాఖకు ఈ విషయాన్ని చేరవేసినట్లు భారత్ తెలిపింది. పాక్ మిలిటరీ యూనిట్లు అన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచన చేసినట్లు చెప్పారు. పాకిస్థాన్ విదేశాగ శాఖ ముందు నిరసన వ్యక్తం చేయాలని ఇస్లామాబాద్లోని భారత ఎంబసీకి చెప్పినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొన్నది.

పారాచూట్ శిక్షణలో ఆర్మీ శునకం



న్యూఢిల్లీ:-16సెప్టెంబర్ (మహాప్రభ).
పోలీసుల జాగిలాలు ఎన్నో సందర్భాల్లో కీలక ఆపరేషన్స్లో పాల్గొన్నాయి. ఇక ఇప్పుడు ఆర్మీ శునకాలు ఏకంగా పారాచూట్ శిక్షణలో పాల్గొంటున్నాయి. ఏరియల్ ఆపరేషన్స్కు కూడా అవి సిద్ధం అవుతున్నాయి. సెంట్రల్ ఇండియాలోని బేహట్ డ్రాప్ జోన్లో ఓ ఆర్మీ పారాట్రూపర్ తన శునకంతో కలిసి విమానం నుంచి జంప్ చేశాడు. డాగ్ హ్యాండ్లర్ కూడా ఆ జంప్లో పాల్గొన్నాడు. పూర్తి స్థాయి కంబాట్ లోడ్తో జంప్ చేశారు.భారతీయ ఆర్మీ తొలిసారి సుశిక్షత శునకాలతో పారాచూట్ జంపింగ్ నిర్వహించింది. సైనికుడు, శునకం మధ్య అసాధారణ అనుబంధం ఏర్పడినట్లు సెంట్రల్ కమాండ్ తన పోస్టులో పేర్కొన్నది. అమెరికాలోని యూఎస్ నేవీ సీల్స్కు చెందిన దళాల్లో ఎయిర్బార్న్ ఆపరేషన్స్లో పాల్గొనే శునకాలు ఉన్నాయి. పాక్లోని ఒసామా బిన్ లాడెన్ను హతమార్చేందుకు ఆ శునకాన్ని వాడారు.

సీఎంను టార్గెట్ చేస్తూ ఏఐ వీడియో..

ఎమ్మెల్యే సోదరుడి అరెస్టు

బల్రాంపూర్ -16సెప్టెంబర్ (మహాప్రభ).



ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ను టార్గెట్ చేస్తూ ఏఐ ద్వారా అభ్యంతరకర రీతిలో వీడియో ను క్రియేట్ చేశారు. అయితే ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో సమాజ్వాదీ పార్టీ మాజీ ఎమ్మెల్యే జగ్రామ్ పాశ్వాన్ సోదరుడిని అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడు సంధూ పాశ్వాన్ను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ విశాల్ పాండే పేర్కొన్నారు. సంధూ పాశ్వాన్ అకౌంట్ నుంచి ఆ వీడియోను పోస్టు చేసినట్లు గుర్తించారు. వీడియో ఘటనను సమోటోగా తీసుకుని, దేహత్ కోత్వాల్ పోలీసు స్టేషన్ కేసు బుక్ చేసినట్లు ఆయన చెప్ఆపరు. పాశ్వాన్ను అరెస్టు చేశామని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. అలాంటి కాంటెంట్ వల్ల సమాజంలో సామరస్యత దెబ్బతింటుందని, కుల విద్వేషాలకు దారి తీసే అభ్యంతరకర వీడియోలు అప్లోడ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పాండే హెచ్చరించారు. ఆన్లైన్లో జరుగుతున్న ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను తమ సోషల్ మీడియా మానిటరింగ్ బృందం నిత్యం పర్యవేక్షిస్తోందన్నారు. అభ్యంతరకర పోస్టులను అప్లోడ్ చేయడం కానీ, షేరింగ్ చేయడం కానీ మానుకోవాలని ఆయన ప్రజల్ని కోరారు.

ఉగ్రవాద సంస్థగా షెహ్‌జాద్ భట్టీ నెట్‌వర్క్



న్యూఢిల్లీ -16సెప్టెంబర్ (మహాప్రభ).
షెహ్‌జాద్ భట్టీ నెట్‌వర్క్‌ను ఉపా చట్టం కింద భారత్ బుధవారం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. సరిహద్దుల్లో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మత్తు మందులను అక్రమ రవాణా చేయడం, నిర్బాగ్యులను ఉగ్రవాదంలోకి చేర్చుకోవడం,భారత ప్రజాస్వామ్య నిర్మాణం, సామాజిక సామరస్యతపై దాడి చేస్తున్నారనే కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నది.

ఆర్మీ శునకం పారాచూట్ జంప్

సైన్యం చరిత్రలోనే మొదటిసారి



న్యూఢిల్లీ -16సెప్టెంబర్ (మహాప్రభ).
ఆర్మీ శునకాలు ఇప్పటికే సైన్యంలో అనేక ధైర్య సాహసాలు కనబరుస్తున్నాయి. ఇప్పుడు ఏరియల్ ఆపరేషన్లో పాల్గొనేందుకు కూడా సిద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్మీ చరిత్రలోనే మొదటిసారి ఓ కాంబాట్ డాగ్ పారాచూట్ జంప్ చేసింది. సెంట్రల్ ఇండియాలోని బేహట్ డ్రాప్ జోన్ వద్ద సూర్య కమాండ్లోని ఓ పారాట్రూపర్, ఒక డాగ్ హ్యాండ్లర్ తన కాంబాట్ డాగ్ కలిసి పూర్తి స్థాయి యుద్ధ సామగ్రితో గాల్లో విమానం నుంచి జంప్ చేశారు. దీనిపై సూర్య కమాండ్ పోస్టు చేస్తూ.. భారత సైన్యంలో మరో ముందడుగు పడబోతున్నదని రాసుకొచ్చింది. ఒక సైనికుడు, శిక్షణ పొందిన శునకానికి ఉన్న అనుబంధంతో పాటు నమ్మకం ఇందులో కనబరిచారని పోస్టులో పేర్కొన్నది. ధైర్యం, కచ్చితత్వం, యుద్ధ నైపుణ్యాలను పెంచడంలో భాగంగా శునకాలకు ఇలాంటి శిక్షణలు మరిన్ని ఇవ్వబోతున్నట్టు సూర్య కమాండ్ అధికారులు వెల్లడించారు.

10 మంది నక్సల్స్‌కు మరణ శిక్ష

ఛత్తీస్‌గఢ్ ఝీరాం ఘాటీ కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు



రాయ్‌పూర్, -16సెప్టెంబర్ (మహాప్రభ).
ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం సృష్టించిన ఝీరాం ఘాటీ మారణకాండ కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 10 మంది మావోయిస్టులకు మరణ శిక్ష విధించింది. ఈ కేసులోని నిందితులందరికీ మరణశిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్‌పుట్ బుధవారం తీర్పు చెప్పారు. నిందితులు ప్రస్తుతం జగదల్‌పూర్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 2013 మే 25న ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న పరివర్తన్ యాత్ర వాహనాల కాన్వాయ్ పై సీపీఐ (మావోయిస్టు) సాయుధ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేయగా, 30 మంది మరణించారు. వారిలో 10 మంది పోలీసులు ఉన్నారు. 38 మంది గాయపడ్డారు. మృతుల్లో గిరిజన నేత మహేంద్ర కర్మ, అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నంద్ కుమార్ పటేల్, కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా కూడా ఉన్నారు.

విధులకు వెళ్లకుండా రూ.70,000 వేతనం

-ఉద్యోగం నుంచి కర్ణాటక ఎమ్మెల్యే మేనకోడలు తొలగింపు



బెంగళూరు, -16సెప్టెంబర్ (మహాప్రభ).
నిబంధనలకు విరుద్ధంగా వైద్య అధికారిణిగా పనిచేస్తున్న కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే మేనకోడలును అధికారులు విధుల నుంచి తప్పించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేశ్ మేతి మేనకోడలు అంకిత యరగల్ బాగల్‌కోట్‌లో ప్రభుత్వ నమ్మల్ క్లినిక్‌లో కొన్ని నెలల నుంచి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రూ.70 వేలకు పైగా జీతాన్ని పొందుతున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి అమె విధులకు గైర్హా జర్ కావడంతో, విచారించగా, ఆమె ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో పీజీ విద్య అభ్యసిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ దవాఖాన నుంచి జీతం తీసుకుంటూ వేరేచోట చదవడం నిబంధనలకు విరుద్ధం కావడంతో ఆమెకు నోటీస్ జారీ చేసి బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే ఆమె హాజరుకాలేదు. దీంతో ఆమె ను వైద్యాధికారిగా విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఆరోగ్య అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

యూపీఐపై మోదీ సర్కార్ యూటర్న్!

ఎండీఆర్ వసూలు చేయ బోమని ఏడాది క్రితం ప్రకటనలు

నాటి మాటలు గుర్తు చేసిన సోషల్ మీడియా యూజర్లు



న్యూఢిల్లీ, -16సెప్టెంబర్ (మహాప్రభ).
ఏడాదిన్నర లోపలే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాటమార్చింది. యూపీఐ లావాదేవీలపై ప్రభుత్వం మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) వసూలు చేయడానికి యోచిస్తున్నదన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేవి అంటూ గత ఏడాది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొన్న విషయాన్ని నగదు రహిత చెల్లింపు విధానంపై చార్జీలు విధించడం పట్ల ఆగ్రహంతో ఉన్న పలువురు సోషల్ మీడియా యూజర్లు బుధవారం గుర్తుచేశారు.యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ వసూలు చేయనున్నారనే ఊహాగానాలు, వాదనలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదారి పట్టించేవి అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 2025 జూన్ 11న తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ఇటువంటి నిరాధారమైన, సంచలనం సృష్టించే ఊహాగానాలు మన పౌరుల్లో అనవసరమైన అనిశ్చితిని, భయాన్ని, అనుమానాలను రేకెత్తిస్తాయి. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది అని ఆర్థిక శాఖ ఆ పోస్ట్లో స్పష్టం చేసింది. ఈ విషయమై ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతూ బుధవారం ఆన్లైన్లోనే ఉన్న ఆ ట్వీట్ను యూజర్లు పలుమార్లు రీపోస్ట్ చేశారు. ప్రభుత్వం ఏదైనా చెబితే సాధారణంగా దానికి వ్యతిరేకమే నిజమవుతుందనడానికి ఇది మరో రుజువు. దీనికి దాదాపు ఒక సంవత్సరం పట్టింది అని ఇంటర్నెట్ స్వేచ్ఛా కార్యకర్త నిఖిల్ పహ్వా కామెంట్ చేశారు. కాగా, ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజావ్యతిరేక చర్యగా అభివర్ణించారు. పార్లమెంటరీ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం చైర్మన్ భర్తృహరి మహతాబ్ మాట్లాడుతూ ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తారని, కమిటీ తదుపరి సమావేశంలో ఈ విషయాన్ని చర్చకు చేపడతామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజా వ్యతిరేక చర్యగా కమిటీ సభ్యుడైన ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమ్చంద్రన్ పేర్కొన్నారు.

జపాన్‌లో లక్ష దాటిన శతాధిక వృద్ధులు



టోక్యో :-16సెప్టెంబర్ (మహాప్రభ).
జపాన్‌లో తొలిసారిగా 100 అంతకన్నా ఎక్కువ వయస్సు గల పౌరుల సంఖ్య లక్ష దాటింది. దేశంలో సెప్టెంబర్ 1 నాటికి శతాధిక వృద్ధుల సంఖ్య 1,07,677కు చేరుకున్నట్లు ఆ దేశ ఆరోగ్య, కార్మిక సంక్షేమ శాఖ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 7,914 ఎక్కువ. శతాధిక వృద్ధుల్లో మహిళలు 94,298 మంది ఉండగా, పురుషులు 13,779 మంది ఉన్నారు.

ఇజ్రాయెల్‌కు ట్రంప్ భారీ ఆయుధ ప్యాకేజీ

వాషింగ్టన్-16సెప్టెంబర్ (మహాప్రభ).



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు 2.8 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 26,000 కోట్లు) విలువైన ఆయుధాలను అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్యాకేజీలో సుమారు 40,000 భారీ బాంబులు ఉండనున్నాయి.ఒక్కో బాంబు బరువు దాదాపు 900 కిలోలు. అయితే ఈ ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. 2024లో అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు 2,000 బాంబుల సరఫరాను నిలిపివేసింది. గాజా వంటి జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తే భారీగా ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని బైడెన్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

లింగ సమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంక్



ఢిల్లీ: స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్లాండ్, నార్వే, నమీబియా, యూకే టాప్-5లో నిలిచాయి. 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్తాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145)లో నిలిచింది. ఇరాన్ (144), పాకిస్తాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది.

సమానత్వానికి 120 ఏళ్లు పడుతుంది..

పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవుల్లో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక

- ఘటనపై విదేశాంగశాఖ ఆగ్రహం
- ఇస్లామాబాద్ దౌత్యవేత్తకు సమన్లు
- పాక్ హైకమిషన్ ఎదుట నిరసన



ఢిల్లీ: అరేబియా సముద్రంలో నావికాదళం దుందుడుకు చర్యకు పాల్పడింది. పాకిస్తాన్ యుద్ధనౌక ఒకటి వేగంగా వచ్చి భారత నిఘా నౌకను ఢీకొంది. ఈ ఘటనపై పాక్ దౌత్యాధికారికి భారత్ సమన్లు జారీ చేసింది. పాక్ నేవీని అదుపులో పెట్టుకోవాలని పాక్‌కు భారత విదేశాంగశాఖ గట్టి హెచ్చరికలు చేసింది. సెప్టెంబర్ 15 సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగింది. భారత నౌకాదళానికి చెందిన ఓ ఫ్రంట్‌లైన్ యుద్ధనౌక సాధారణ నిఘా కార్యకలాపాల్లో భాగంగా సముద్రంలో పర్యటిస్తుండగా, పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన ఓ నౌక దాని వైపు వచ్చినట్లు తెలుస్తోంది. పాక్ నౌక అధిక వేగంతో భారత నౌకకు సమీపంగా వచ్చి, అసురక్షితంగా, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధంగా దిశ మార్చుకోవడంతో రెండు నౌకలు ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఘటనలో భారతీయ నావికాదళ సిబ్బందికి గానీ, యుద్ధనౌకకుగానీ ఎటువంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ బాధ్యతారాహిత్య చర్యను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. పాక్ దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి గట్టిగా మందలించింది. ఈ సంఘటన 1991 నాటి సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందానికి విరుద్ధంగా ఉందని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌లోని సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరింది. కాగా, 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే జరిగింది. ఆ సమయంలో సముద్రపు దొంగల చెర నుంచి విడుదలైన ఎంబీ సూయజ్ అనే సరకు నౌకకు పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన పిఎన్ఎస్ బాబర్ రక్షణ కల్పిస్తోంది.

భారత్‌పై అమెరికా 100 శాతం సుంకం?

-రష్యా ఆంక్షల బిల్లుతో భారత్‌కు ముప్పు
-241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
-సెనేట్‌లో ఇప్పటికే ఆమోదం
-ట్రంప్‌కు పెరగనున్న సుంకాల అధికారం
-ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
-బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు



వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు చట్టపరమైన మార్గం త్వరలో ఏర్పడే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన రష్యా ఆంక్షల బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభలో బుధవారం మధ్యాహ్నం తుది ఓటింగ్ జరగనుంది. బిల్లు ఆమోదం పొందితే అధ్యక్షుడి ఆమోదానికి పంపిస్తారు.మంగళవారం సాయంత్రం ప్రతినిధుల సభలో బిల్లు విధానపరమైన అడ్డంకిని అధిగమించింది. ఇద్దరు డెమోక్రాట్లు తమ పార్టీ నిర్ణయానికి భిన్నంగా రిపబ్లికన్లతో కలసి బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో తీర్మానం 241-211 ఓట్లతో ఆమోదం పొందింది. సెనేట్ ఇప్పటికే దీన్ని ఆమోదించింది.ు

పాస్‌పోర్ట్ ర్యాంకులో భారత్‌కు షాక్

ఢిల్లీ:

ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026' లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్ లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. 'ఆర్టన్ క్యాపిటల్' సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసా-ఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్' (ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసా-ఆన్-అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసా-ఆన్-అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు ఏకంగా 163 దేశాలకు కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే. అయితే ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జూలై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం" అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేసీఆర్ భూదోపిడీపై విచారణ

(మొదటి తరువాయి)

ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ బృందం(ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ బృందం కేసీఆర్ కుటుంబంతో పాటు ధరణి అక్రమాలపై 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భూములపై కోర్టు కేసులు, వివాదాలతో కొంత ఆలస్యమైనా కేసీఆర్ భూదోపిడీని నిగ్గుతేలుస్తామన్నారు. భూ దోపిడీకి పాల్పడిన ఆ కుటుంబం జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ బినామీ బోయినపల్లి శ్రీనివాసరావు పట్టినాగులపల్లిలో ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ చేసినట్టు బహిర్గతమైందని చెప్పారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ ఫిరాయించినందుకు ఆయన పేరిట 106 ఎకరాల ఫారెస్ట్ భూమిని పట్టాగా మార్చారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు కోర్టుకు పోతే ఆ భూమి ప్రయివేటు భూమి అంటూ కలెక్టర్ నివేదించారంటే, కేసీఆర్ కుటుంబం ఏ రకంగా భూ విధ్వంసానికి పాల్పడిందో అర్థమవుతోందన్నారు. బహదూర్‌గూడలో 77 ఎకరాల భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి లేఖ రాయాలని సూచించారు. ఓ పత్రిక ఎమ్‌డీకి బెంజ్‌కార్లు ఎలా వచ్చాయో, అందుకు ప్రతిఫలంగా గోల్డ్



స్టోన్ ప్రసాద్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

ధరణి అడ్డం పెట్టుకుని... భూదాన్ భూముల పట్టా

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని భూదాన్ భూములకు ఇబ్బడి ముబ్బడిగా పట్టాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. సిరిసిల్లలో ఎనిమిదివేల ఎకరాల అసైన్డ్ భూములు బదలాయించారని తెలిపారు. సందీప్ భూను కలెక్టర్‌గా వేస్తే రెండువేల ఎకరాలను బయటకు తీశారని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు చుట్టు పక్కల మైహోం రామేశ్వర రావుకు 2,647 ఎకరాల భూమి కట్టబెట్టారన్నారు. ప్రజల సొమ్మును ఇష్టం వచ్చినట్టు కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేళ్ల చెరువులో ధరణి ద్వారా భూదాన భూమికి పట్టా ఇచ్చారని ఆధారాలను బహిర్గతం చేశారు.

మైహోం కంపెనీకి 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీ కి వాడుకుంటున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు... వక్ఫ్ భూములన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా? అని నిలదీశారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారని విమర్శించారు. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని తెలిపారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారని చెప్పారు. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడిందని గుర్తుచేశారు. ఏ రాక్షసుడికైనా సమయం వస్తుంది... అప్పుడే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. 22ూ ను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారని తెలిపారు. సంగారెడ్డి లో భూముల చిట్టా కూడా బయట పెడతానన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే.. మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు.

సౌదీపై హౌతీల దాడులు

- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్

రియాద్:

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాలుస్తున్నాయి. సౌదీ లక్ష్యంగా హౌతీ తిరుగుబాటు దారులు విస్తృత దాడులకు తెగబడుతున్నారు. సౌదీ అరేబియాలోని కీలక సైనిక, చమురు మౌలిక సదుపాయాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. తాజాగా, ఇస్లాం పవిత్ర నగరం మక్కాను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి ప్రయత్నించారని సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై ముస్లిం ప్రపంచంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, పవిత్ర స్థలాల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ స్పష్టం చేసింది. మక్కా వైపు వస్తున్న డ్రోన్ను కూల్చివేశామని సౌదీ తెలిపింది. సంకీర్ణ దళాల కమాండ్ మాత్రం హౌతీలకు తీవ్ర హెచ్చరిక చేసింది. మక్కా, మదీనా పవిత్ర మసీదులు. వాటిని సందర్శించే యాత్రికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపింది. అవసరమైన, నిరోధక చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని పేర్కొంది. 57 ముస్లిం దేశాల సమాఖ్య అయిన ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్



కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. అయితే ఈ ఆరోపణలను హౌతీలు తీవ్రంగా ఖండించారు. మక్కాను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న సౌదీ ప్రకటన పూర్తిగా అబద్ధమని హౌతీ రాజకీయ విభాగం సభ్యుడు హజేమ్ అల్-అసద్ పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణాలు చేశారని, ఇప్పుడు కూడా అవి ప్రజలను మోసం చేయలేవని సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు.

దాడిని ఖండించిన భారత్

మక్కా పవిత్ర నగరానికి సమీపంలో డ్రోన్ను అడ్డుకున్న ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా భూభాగంపై, ముఖ్యంగా పౌరులు, పౌర మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థలపై దాడులు ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీయడంతో పాటు కీలక సముద్ర మార్గాల్లో నౌకయాన స్వేచ్ఛకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొంది. మక్కా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన నగరం కావడంతో ఈ ఘటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికులు, పౌరుల భద్రతను కాపాడాల్సిన అవసరాన్ని భారత్ నొక్కిచెప్పింది. ఇదే సమయంలో సౌదీ అరేబియాలోని చమురు మౌలిక సదుపాయాలు, వాణిజ్య నౌకాయానంపై జరుగుతున్న దాడులపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. బాబ్ అల్ మండెబ్ జలసంధి ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షిత నౌకాయానం, వాణిజ్య ప్రవాహాన్ని త్వరగా పునరుద్ధరించాలని భారత్ కోరింది.

ఎర్ర సముద్రంలో హౌతీల దూకుడు

ఇటీవల హౌతీలు యెమెన్ ఎర్ర సముద్ర తీర ప్రాంతాల్లో తమ నియంత్రణను విస్తరించడంతో పాటు బాబ్ అల్ మండెబ్ జలసంధిపై అధిపత్యం పెంచుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ మార్గం ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఆడెన్తో కలుపుతుంది. అంతర్జాతీయ నౌకాయానానికి ఇది కీలకమైన మార్గం. హౌతీలు సౌదీకి చెందిన నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించడంతో ఎర్ర సముద్రంలోని నౌకాయాన భద్రతపై ఆందోళనలు పెరిగాయి. హౌతీలు సౌదీ అరేబియాలోని చమురు మౌలిక వసతులను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారైన సౌదీపై దాడులు అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నేడే తెలంగాణ విమోచన దినోత్సవం

(మొదటి తరువాయి)

కేంద్ర సాయుధ దళాల విన్యాసాలు, వేలాది మంది తెలంగాణ కళాకారులతో ఆకట్టుకునేలా నాట్య ప్రదర్శనలు, సంప్రదాయ దుస్తుల విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. చారిత్రక పోరాటాలను కళ్లకు కట్టేలా సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్ వద్ద భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ తదితర ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన చారిత్రక ఫోటో ఎగ్జిబిషన్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ, భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం కావడంలో అప్పటి ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. పటేల్ చూపిన తెగువ, దృఢ సంకల్పం లేకపోతే తెలంగాణా భారతదేశంలో భాగంగా ఉండేది కాదని ఆయన ప్రశ్నించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, తెలంగాణ నేల పోరాటాలకు, అసమాన త్యాగాలకు నిలయమని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట స్ఫూర్తిని, అమరుల త్యాగాల చరిత్రను భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తెలంగాణ చరిత్ర దాచేస్తే దాగదు: ఎంపీ ఈటల రాజేందర్

చరిత్ర దాచేస్తే దాగేది కాదని, నేటి తరం అనుభవిస్తున్న స్వేచ్ఛ వెనుక లక్షలాది మంది చేసిన త్యాగాలు, కోట్లాది ప్రజల కష్టాలు ఉన్నాయని, విద్యార్థులకు చదువు, ఉద్యోగంతో పాటు దేశభక్తి, త్యాగాల విలువను కూడా నేర్పించాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. భరతమాత దాస్య శృంఖలాలను తెంచేందుకు లక్షలాది మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. తెలంగాణ విమోచన విషయంలో 'విలీనం, విమోచనం, విముక్తి' అనే పదాలపై చర్చ కంటే, ప్రజలకు స్వేచ్ఛ లభించిన చారిత్రక ఘట్టంగా చూడాలని అన్నారు. చరిత్ర లేకుండా వర్తమానం లేదు.. వర్తమానం లేకుండా భవిష్యత్తు లేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాటి అమరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఇలాంటి ఫోటో ఎగ్జిబిషన్ల లక్ష్యమని తెలిపారు.

టీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి!

(మొదటి తరువాయి)

ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిన ఆయన రెండు రోజులపాటు అక్కడే ఉండనున్నట్లు సమాచారం. ఒకవైపు రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జి ఎంపిక.. మరోవైపు పార్టీ సంస్థాగత నియామకాలు.. ఇంకోవైపు మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపై చర్చలు సాగుతున్న సమయంలో ఆయన ఢిల్లీవెళ్లడం విశేషం.

మూరనున్న సమీకరణాలు?

మీనాక్షి నటరాజన్ తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక సమయంలో బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం, సంస్థాగత వ్యవహారాలు, ముఖ్యమైన రాజకీయ నిర్ణయాల్లో ఆమె పాత్ర కొనసాగింది. ఇప్పుడు ఆమె స్థానంలో వచ్చే నేత కేవలం ఖాళీలను భర్తీ చేసే ఇన్‌ఛార్జిగా ఉంటారా... లేక రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త దిశను నిర్దేశించే బాధ్యతను కూడా చేపడతారా? అన్నదే అసలు ప్రశ్న. కొత్త ఇన్‌ఛార్జి ఎంపికలో సీనియారిటీ, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన, అధిష్టానంతో సమన్వయం, ముఖ్యమంత్రి, పీసీసీ మధ్య సమతౌల్యం వంటి అంశాలు కీలకంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తాజాగా తన రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం పూర్తయిన సందర్భంగా పార్టీని రాష్ట్ర స్థాయి నుంచి బూత్



స్థాయి వరకు బలోపేతం చేశామని చెప్పారు. ఇకపై సంస్థాగత బలోపేతంపై మరింత దృష్టిపెడతామని, ఈ నెలాఖరులోగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం పూర్తి చేస్తామని వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో ఢిల్లీ నుంచి పరిశీలకుల వ్యవస్థను కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంటే.. పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక నియామకాలు ముందున్నాయన్న చర్చ జరుగుతోంది. డీసీసీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు.. ఇలా పార్టీ యంత్రాంగంలో పలు స్థాయిల్లో మార్పులు జరగనున్నాయి. ఈ సమయంలో ఢిల్లీకి వెళ్లడం.. కొత్త ఇన్‌ఛార్జితో కలిసి భవిష్యత్ సంస్థాగత నిర్మాణంపై చర్చలకు దారితీస్తాయన్న అంచనాలకు కారణమవుతోంది. మరోవైపు.. మంత్రివర్గంపై మళ్లీ చర్చ మొదలైంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించిన తరువాత తెలంగాణ కేబినెట్‌లో ఏర్పడిన ఖాళీలు, భవిష్యత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్‌లో చర్చ కొనసాగుతోంది. సెప్టెంబర్ చివర లేదా అక్టోబర్‌లో ఈ ప్రక్రియపై నిర్ణయం ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కొత్త ఇన్‌ఛార్జి ముందు మూడు పెద్ద సవాళ్లు

కొత్తగా బాధ్యతలు చేపట్టే ఇన్‌ఛార్జికి ప్రధానంగా మూడు అంశాలు సవాళ్లుగా మారనున్నాయి. మొదటిది పార్టీని ఎన్నికల దిశగా సమీకరించడం. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. అధికారంలో ఉన్న పార్టీకి సంస్థాగత పునర్నిర్మాణం ఇప్పటి నుంచే కీలకం. రెండోది పార్టీ ప్రభుత్వ సమన్వయం. తనకు ముఖ్యమంత్రితో 'ఒకే తరంగదైర్ఘ్యం'లో పనిచేసే సంబంధం ఉందని మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కొత్త ఇన్‌ఛార్జి ఈ సమన్వయాన్ని ఎలా కొనసాగిస్తారన్నది కీలకం. మూడోది - అంతర్గత అసంతృప్తికి పరిష్కారం. మంత్రి పదవులు, పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు, నియోజకవర్గాల రాజకీయ సమీకరణలు.. ఇవన్నీ కాంగ్రెస్‌లో సహజంగానే ఆశావహులను పెంచుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణపై సీనియర్లు, యువ ఎమ్మెల్యేల మధ్య పోటీ ఉన్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఏదేమైనా 18వ తేదీన ప్రకటించే ఇన్‌ఛార్జి వచ్చాక తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథ.

అర్హులైన వారందరికీ పింఛన్ అందేలా పరిశీలన

-చౌదర్పల్లి వార్డులో పింఛన్ల వెరిఫికేషన్..
-విద్యార్థులకు డ్రెస్సులు, షూస్ పంపిణీ





దేవరకద్ర సెప్టెంబర్ 16 మహాప్రభ
దేవరకద్ర: మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్పల్లి వార్డులో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు పింఛన్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ మాధవి యుగంధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, స్పెషల్ ఆఫీసర్, వార్డు ఆఫీసర్ రాజేష్, నాయకులు హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల దరఖాస్తులు, అర్హతకు సంబంధించిన వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో పింఛన్ల వెరిఫికేషన్ చేపట్టినట్లు చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా నిబంధనల మేరకు పరిశీలన చేపడుతున్నట్లు కమిషనర్ నరేష్ బాబు పేర్కొన్నారు. అనంతరం చౌదర్పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, షూస్, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభతో పోలీసు సురక్ష గణనాథుని నిమజ్జనం జిల్లా ఎస్పీ :సునిత రెడ్డి, ఐపీఎస్.,

-సంప్రదాయబద్ధంగా పోలీసు సురక్ష గణపయ్య లడ్డూ వేలం పాట
- భజనలు, బాజాభజంత్రీలతో ఆధ్యాత్మిక శోభతో నిమజ్జనం
-భక్తి సంస్కృతి, సంప్రదాయాల నడుమ పోలీసు సురక్ష గణనాథునికి ఘన వీడ్కోలు
- శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించడంలో పోలీసుల సమన్వయం అభినందనీయం ఎస్పీ



సెప్టెంబర్ వనపర్తి 16 (మహాప్రభ)
వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొలువుదీరిన పోలీసు సురక్ష గణనాథునికి బుధవారం జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో గణనాథునికి పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో సమర్పించిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పెద్ద లడ్డు 61 వేలకు చిన్న లడ్డు 21 వేలకు సొంతం చేసుకుని భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం భజనలు, బాజాభజంత్రీలు, కోలాటాలు, జై గణేశ్ నినాదాల నడుమ గణనాథుని ఊరేగింపును ఆధ్యాత్మికంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ నిమజ్జనంలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే గణనాథుని ఆశీస్సులతో వనపర్తి జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభ్రాతృత్వాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. వినాయక నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలు. భక్తితో పాటు బాధ్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం కలిగి ఉత్సవాలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజల భక్తి భావాలను గౌరవిస్తూ, ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుంది. ప్రజలు కూడా పోలీసుశాఖకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రజల భద్రత, శాంతి, సౌభ్రాతృత్వమే పోలీసుశాఖకు అత్యంత ప్రాధాన్యతని భక్తి, సంప్రదాయం, పోలీసు ఐక్యతకు ప్రతీకగా . సంప్రదాయ కళారూపాలు, భక్తి గీతాలు, కోలాటాలతో ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణంలో గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఎస్పీ తెలిపారు ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ ఓ, సునంద, వనపర్తి సీఐ, సుగంధరత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, పర్వతాలు, నరేష్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్, అమరచింత ఎస్సై, స్వాతి, రేవల్లి ఎస్సై, రజిత శ్రీరంగాపూర్ ఎస్సై,హిమబిందు,రిజర్వ్ సబ్ఇన్స్పెక్టర్లు వినోద్, మగ్దూం బారీ, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నారాయణఖేడ్,
సెప్టెంబర్ 16 మహాప్రభ
వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న వారిని,చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారిని బుధవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి బాధితులను పరామర్శించారు.మనూర్ మండలం దుద్ గొండ గ్రామానికి చెందిన డేవిడ్ తల్లి, అదే గ్రామానికి చెందిన సంగారెడ్డి కుమారుడు ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధన్వార్ గ్రామానికి చెందిన కిషన్ రావు,ఆయన భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు,సర్పంచ్ అమృత్,ఖేడ్ పట్టణ అధ్యక్షులు నగేష్,నాయకులు ముజమ్మిల్,మొగులయ్య,జైపాల్ రెడ్డి, అంజన్న,ఏశప్ప, అంజిరెడ్డి,మహిపాల్ రెడ్డి,వెంకట్ రావు, ఖదీర్,సామెల్, నర్సారెడ్డి,గుండప్ప తదితరులు ఉన్నారు.

లోది సామాజిక వర్గం సామాజికంగా అభివృద్ధి చెందాలి

- లోది సామాజిక వర్గనికి సామాజిక వివక్ష తగదు
-తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీ రంగు
-లోది సామాజిక వర్గనికి విద్య ,ఉపాధి మార్గాలు కల్పించాలి.
-అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ జిల్లా -16సెప్టెంబర్ (మహాప్రభ,).
లోది సామాజిక వర్గ సమస్యల అధ్యయనానికి బీసీ కమిషన్ చైర్మన్ , సభ్యులు నేడు మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలోని లోది సామాజిక వర్గం కాలనీలో పర్యటించారు.మెదక్ జిల్లా: లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీ రంగు లతో మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా లోది సామాజిక వర్గనికి చెందిన సంఘాల ప్రతినిధులు, ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్లు, వృత్తిపరమైన అవకాశాలు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను స్వీకరించారు.
లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ, ..లోది సామాజిక వర్గం ప్రజలు సామాజికంగా , ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, లోది సామాజిక వర్గం పై సామాజిక వివక్ష తగదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సామాజిక-- ఆర్థిక పరిస్థితులు, విద్యా మరియు ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు.
ప్రజలు అందించిన వినతులు, సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, సంబంధిత అంశాలను కమిషన్ పరిధిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగిన నివేదికలు, సిఫార్సులు అందజేస్తామని తెలిపారు.
అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. లోది సామాజిక వర్గం వారు పెద్ద శంకరంపేట మండలంలోని ఆరేపల్లి ,పెద్ద శంకరంపేట్, కమలాపూర్ గ్రామాల్లో 43 కుటుంబాలకు గాను 179 మంది ఉన్నారని, రేగోడు మండలంలోని కొత్వాన్ పల్లి గ్రామంలో 19 కుటుంబాలకు 77 మంది మంది ఉన్నారని తెలిపారు.
లోది సామాజిక వర్గం వారి యొక్క కుల దృవీకరణ పత్రం తీసుకునటలో అవగాహన లేక ప్రస్తుతము వీరు ముదిరాజ్ కులంలో కుల దృవీకరణ పత్రం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.
లోది సామాజిక వర్గనికి మరిన్ని విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని , సామాజికంగా వారిని ముందుకు తీసుకెళ్లాలని, ఎలాంటి సామాజికి వివక్ష లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ ,తహసిల్దార్ నారాయణ , ఏం పి డి ఓ క్రాంతి కుమార్, సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ ,సంబంధిత జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, లోది కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

-గజ ఈతగాళ్లు, మత్స్యకారులను షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంచాలి.
-శాఖల మధ్య సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
-నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ.డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్



మెదక్ జిల్లా -16సెప్టెంబర్ (మహాప్రభ).
వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.కొంటూరు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
భక్తులు, చిన్న విగ్రహాలు, భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల బారికేడింగ్ చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలను అనుమతించకుండా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు.నిమజ్జన సమయంలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా వెంటనే ఎదుర్కొనేలా జేసీబీలు, క్రేన్లు, అగ్నిమాపక వాహనాలు, అత్యవసర సేవలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. మత్స్యకారులు, గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా విధుల్లో ఉంచి, నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని సూచించారు.నిమజ్జన ఏర్పాట్లకు వినియోగించే వాహనాలు, యంత్రాల వినియోగానికి సంబంధించిన డ్యూటీ వివరాలు, సిబ్బంది సంతకాలు, రోజువారీ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అంశాన్ని ముందుగానే పర్యవేక్షించాలని, నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పేర్కొన్నారు. ఎస్పీ వెంట డియస్పి ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి, వైస్ చైర్మన్ నరేష్,సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- దేవరకద్రలో అప్రమత్తమైన యంత్రాంగం..
- బేబీ పాండ్ వద్ద ఏర్పాట్లపై ఆజూదీ ప్రత్యేక దృష్టి



దేవరకద్ర సెప్టెంబర్ 16 మహాప్రభ
దేవరకద్ర: వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు దేవరకద్ర మున్సిపాలిటీ యంత్రాంగం సిద్ధమవుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో వినాయక నిమజ్జనానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆజూదీ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్ల్స్ హైస్కూల్ వెనుక భాగంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన వినాయక నిమజ్జన బేబీ పాండ్‌ను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, భక్తుల రాకపోకలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
5 అడుగుల లోపు ఎత్తు కలిగిన వినాయక విగ్రహాలను బేబీ పాండ్‌లోనే నిమజ్జనం చేసుకునేలా భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆజూదీ అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా, పారిశుధ్య చర్యలను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వసతి, బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ, భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజలు

-భక్తులకు అన్నప్రసాద వితరణ



దేవరకద్ర: సెప్టెంబర్ 16 మహాప్రభ
దేవరకద్రలోని ఈశ్వర వీరప్ప స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి విచ్చేసిన భజన బృందాల సభ్యులతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాతలు: అరుణాచలం పార్వతమ్మ రాజు, మాజీ సర్పంచ్, దేవరకద్ర; అరుణాచలం వనజ--నవీన్; డాక్టర్ అరుణాచలం అక్షిత--రఘువరన్; డాక్టర్ సరిత.

కెసిఆర్ పాలనాలో గిరిజనులకు స్వర్ణయుగం

-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 16(మహాప్రభ)
గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన అభివృద్ధి ప్రదాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని తండాలు, గూడేల్లోని గిరిజనులు గుర్తుచేసుకుంటున్నారని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సెప్టెంబర్ 17న గిరిజన రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కేసీఆర్ చేసిన ప్రకటనను పురస్కరించుకొని గిరిజనులు సంబురాలు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో గిరిజనులకు హక్కులు, ఆత్మగౌరవం, భూమి, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, స్వయం పాలనకు ప్రాధాన్యత లభించిందన్నారు.గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి స్వయం పాలనకు బాటలు వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమం, ఉపాధి రంగాల్లో గిరిజనుల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినట్లు



తెలిపారు.కేసీఆర్ హయాంలో గిరిజన గురుకులాలను విద్యా విప్లవానికి కేంద్రాలుగా తీర్చిదిద్దితే.. నేడు అదే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటుచేసుకోవడం గిరిజన విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని రవీంద్ర కుమార్ విమర్శించారు.గిరిజనుల విద్య, వైద్యం, భూమి, రిజర్వేషన్లు, ఉపాధి, ఆత్మగౌరవం వంటి రంగాల్లో గత ప్రభుత్వం వేసిన పునాదులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ పాలనలో తమకు జరిగిన అభివృద్ధిని గిరిజనులు గుర్తుచేసుకుంటున్నారని, గిరిజన సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు చర్చించుకుంటున్నారని రవీంద్ర కుమార్ అన్నారు.మళ్లీ కేసీఆర్.. మళ్లీ గిరిజన సంక్షేమం.. మళ్లీ స్వర్ణయుగం అనే ఆకాంక్ష గిరిజనుల్లో బలంగా వినిపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

జీవరాశులను ఓజోన్ పొర రక్షిస్తుంది

- ప్రిన్సిపాల్ రమావత్ రవి

దేవరకొండ సెప్టెంబర్ 16(మహాప్రభ)
దేవరకొండలోని మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ భూమిపై జీవరాశుల మనుగడకు ఓజోన్ పొర అత్యంత కీలకమైనదని, సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై జీవరాశులను ఓజోన్ పొర రక్షిస్తుందని తెలిపారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు.



పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాలు లేదా శాస్త్రవేత్తల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని, ఆ సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఓజోన్ పొరను రక్షించేందుకు హానికరమైన రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణహిత చర్యలను ప్రోత్సహించడం, సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. “నేటి పర్యావరణ పరిరక్షణే రేపటి తరాలకు సురక్షితమైన భవిష్యత్తుకు పునాది” అని పేర్కొంటూ విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, సి ఓ ఈ జి.లింగారెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డోకె. పృథు, ఎన్సిసి నోడల్ ఆఫీసర్ నాగేంద్ర తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూములు కేటాయించి న్యాయం చేయాలి

-బీఆర్ఎస్ కొండమల్లెపల్లి మండల అధ్యక్షులు రమావత్ దాస్రూ నాయక్

దేవరకొండ సెప్టెంబర్ 16(మహా ప్రభ)
దేవరోని తండాకు చెందిన గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల నుంచి తొలగించకుండా, వారికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ కొండమల్లెపల్లి మండల అధ్యక్షులు రమావత్ దాస్రూ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.దేవరకొండ పట్టణంలో సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కొండమల్లెపల్లి మండలం దేవరోని తండాకు చెందిన గిరిజన కుటుంబాలు తమ తండా పరిధిలోని భూముల్లో ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గుమ్మడిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 86లో ఉన్న భూముల్లో తమకు అనుకూలంగా ఉన్న భూమిని కేటాయించాలి ఆయన కోరారు.తమ కుటుంబాలు తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నప్పటికీ ఇప్పటివరకు వేరు భూమిలోకి మార్చడానికి అధికారులు చూస్తున్నారు అని ఆయన అన్నారు.భూస్వాముల భూములు





ఉంచుకొని, పేద గిరిజనుల భూములు కేటాయించాలని చేస్తున్నారని ఆయన అన్నారు.తమకు భూమిని కేటాయిస్తే వ్యవసాయంపై ఆధారపడి కష్టపడి జీవనం సాగించడంతో పాటు, తండాకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకునే అవకాశం కలుగుతుందని అన్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఇప్పటికే పిటిషన్ అందజేశామని, గిరిజన భూములకు సంబంధించిన అంశాలపై న్యాయపరమైన సహాయం పొందేందుకు జీటీ లాయర్‌ను కలవాలని సూచించినట్లు తెలిపారు.గిరిజన కుటుంబాలకు వారి తండాకు దూరంగా కాకుండా, తమ జీవనానికి అనుకూలమైన భూమిని కేటాయించి, భూ హక్కులు కల్పించాలని రమావత్ దాస్రూ నాయక్ కోరారు. అధికారులు ఈ సమస్యను పరిశీలించి న్యాయబద్ధంగా పరిష్కరించి గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ గుండెబోయిన లింగం యాదవ్, ఇస్లావత్ గోవింద్,ఇ ఇ రవీందర్, ఇ . శంకర్, గోపాల్, వినోద్, ఇ కుమార్,. బిక్ష,. భాను,.శ్రీనివాస్, . నర్సింహారావు, . రవి తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు చెత్తకుప్పపాలు

నారాయణఖేడ్ -16సెప్టెంబర్ (మహాప్రభ).
తెలంగాణ రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా 6 పథకాల కోసం ప్రజాపాలన పేరుతో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలు అవుతున్న మహాలక్ష్మి,రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్ళు,గృహజ్యోతి,చేయూత పథకాల కోసం మున్సిపల్ మరియు మండల అభివృద్ధి కార్యాలయాల అధికారులు



ధరఖాస్తులను స్వీకరించారు.పథకాల కోసం లబ్దిదారులు ఆన్లైన్ చేసుకొని ధరఖాస్తూ పత్రాలను కార్యాలయాలలో సమర్పించారు.కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన పత్రాలు నారాయణఖేడ్ మండల అభివృద్ధి కార్యాలయం అధికారులు చెత్తకుప్పలో పడవేశారు.రోడ్డుపై,చెత్తకుప్పలో దరఖాస్తు పత్రాలను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామాయంపేటలో మూడో రోజు గణేష్ పండగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం



రామాయంపేట, సెప్టెంబర్ 16 మహాప్రభ
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీ కాంప్లెక్స్ వారి ఆధ్వర్యంలో మూడో రోజు గణేష్ ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాంప్లెక్స్ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

దేవరకొండలో జాతీయ పోషణ మాసం ఘనంగా జరిగింది



దేవరకొండ సెప్టెంబర్ 16(మహాప్రభ)
జాతీయ పోషణ మాసం సందర్భంగా ఐ సి డి ఎస్ ప్రాజెక్టు దేవరకొండ పరిధిలో ని దేవరకొండ- 11 అంగన్వాడికి కేంద్రం శివాజీ నగర్ లో పోషణ మాసం ప్రోగ్రాం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిడిపిఓ శ్రీమతి చంద్రకళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజు మనం తీసుకున్నటువంటి ఆహారం లో అన్ని రకాల పోషకాలు ఉండే విధంగా చూసుకోవాలని, ముఖ్యంగా గర్భిణీలు ,బాలింతలు, పిల్లలు, కిషోర బాలికలు మన పరిసరాలలో దొరికేటటువంటి సిరి ధాన్యాలు, చిరుధాన్యాలు మరియు ఆకుకూరలు, పండ్లు పాలు, ప్రతినిత్యం భోజనం లో ఉండే విధంగా చూసుకోవాలి అని తెలియ చేశారు, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎం. విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ టీ పద్మావతి, ఆయమ్మ ఆసియా .గర్భిణీలు బాలింతలు ,తల్లులు తదితరులు పాల్గొన్నారు

హమారా ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

-ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పోతేం సహదేవుడు మాదిగ



దేవరకొండ సెప్టెంబర్ 16(మహాప్రభ
ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ ఆదేశాల మేరకు దేవరకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కల్పిత అంశాలతో పుస్తకం రాసి ఈ నెల 18న విడుదల చేస్తానని ప్రకటించిన హమర ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పోతేం సహదేవుడు మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఔన్నత్యానికి చరిత్రకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హమార ప్రసాద్ రచించిన పుస్తకాన్ని నిషేధించాలని, ప్రసాద్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆరెకంటి యేసయ్య,జిల్లా కార్యదర్శి కొండ్రపల్లి నాగేష్,ఎం ఎస్ ఎఫ్ జిల్లా ఇంచార్జ్ మాతంగి హరికృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎర్ర యాదగిరి, కొండ్రపల్లి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు,ఎం ఎస్ ఎఫ్ దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ కొండ్రపల్లి నగేష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు పొట్ట ప్రభు, అంకురి నాగరాజు, అంకురి అరుణ్, ఎమ్మార్పీఎస్ చందంపేట మండల అధ్యక్షులు పగిడిమర్రి రవీందర్ మాదిగ,మరియు వి హెచ్ పి ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



నారాయణఖేడ్,సెప్టెంబర్ 16(మహాప్రభ
ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నారాయణఖేడ్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9:30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమశీలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు,పుర ప్రముఖులు పాల్గొనాలని సబ్ కలెక్టర్ ఎన్.ఉమా హారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్లారెడ్డి బస్టాండ్‌లో వివిధ రకాల నేరాలపై పోలీసుల అవగాహన

-మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై కళాబృందం ప్రచారం



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 16, (మహాప్రభ):
ఎల్లారెడ్డి బస్టాండ్ ఆవరణలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలపై కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాల సమయంలో ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం ప్రదర్శించిన అవగాహన కార్యక్రమాన్ని బస్టాండ్‌లోని ప్రయాణికులు, ప్రజలు ఆసక్తిగా వీక్షించారు.

ప్రజా హక్కుల సాధన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి పుట్టిన రోజు వేడుకలు



దేవరకొండ సెప్టెంబర్ 16(మహాప్రభ)
నల్గొండ పట్టణం లోని ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యక్రమంలో ప్రజా హక్కుల సాధన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి పుట్టిన రోజు సందర్భంగా శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తిరుగమల్ల షాలెమ్ రాజు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.ఇట్టి కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర నాయకులు రమేష్,బన్నీ, లింగస్వామి, సూర్యనారాయణ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్దాపురం రాములు కుటుంబ సభ్యులకు చేనేత సహకార సంఘం ఆర్థిక సహాయం



పాపన్నపేట, సెప్టెంబర్16(మహాప్రభ)
మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన పద్మశాలి సంఘం సభ్యులు బద్దాపురం రాములు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు.ఈవిషయం తెలుసుకున్న పాపన్నపేట చేనేత సహకార సంఘం,పద్మశాలి కులస్తులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5000/ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లందేశీ శ్రీనివాస్,నాయకులు కల్లేటి సంగమేశ్వర, కొడపాక శివశంకర్, బద్దపురం సంగమేశ్వర, పల్లె సంగమేశ్వర,పల్లె రాజు,కల్లేటి యుగంధర్, పడిగే కిష్టయ్య,ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లా సుధీర్ రెడ్డి గారి 10వ రోజు కార్యక్రమంలో పాల్గొన్న పిఏసి ఎస్ జ్వాలానరసింహారెడ్డి.



దేవకొండ డివిజన్ సెప్టెంబర్ 16 (మహాప్రభ)
దేవరకొండ మండలంలోని పడమట్ పల్లి గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి గారి 10వ రోజు కార్యక్రమంలో పాల్గొని వారిచిత్రపటానికినివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంటా మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప ప్రవీణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకులు, మరియు తదితరులు ఉన్నారు.

దసురు నాయక్ కుటుంబానికి అండగా పీఏసీఎస్ చైర్మన్





దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 16 (మహాప్రభ)
చందంపేట మండలంలోని బుధవారం.బొడ్డోనితండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నేనావత్ దసురు నాయక్. రెండు రోజుల క్రితం కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన విషయం తెలుసుకొని నేడు వారి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సహాయంగా 25,000.రూపాయలు ఆర్థిక సహాయం అందించి వారి పిల్లల చదువులకయ్యే ఖర్చు తానే చూసుకుంటానని హామీ ఇవ్వడమే కాకుండా భవిష్యత్తు లో వారి కుటుంబానికి ఏ అవసరం ఉన్నా అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఆయన వెంటా మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, సర్పంచ్ చిట్టెమ్మ లాల్ సింగ్, మాజీ సర్పంచ్ బాలు, మాజీ ఉప సర్పంచ్లు యాదయ్య, బాలు, డైరెక్టర్ అంకులయ్య, ఇప్ప తిరుపతి రెడ్డి, చాట్లఎ వెంకటయ్య, వార్డు సభ్యులు వెంకటాచారి, ఆంజనేయులు, చాట్ల బలరాం, బడేటి కిష్టయ్య, పోలగొని వెంకటయ్య, రమేష్, మరియు తదితరులు ఉన్నారు.

గణనాథుడి దర్శనానికి ఆహ్వానం



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 16 (మహాప్రభ)
చందంపేట మండల మోత్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో కొలువైన శ్రీ గణనాథునికి దర్శించుకొని బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసేమహాఅన్నదాన కార్యక్రమంనికి రావాల్సిందిగాఆహ్వానించిన తండా కమిటీ సభ్యులు ఆహ్వానించిన వారు ఇస్లావత్ శంకర్ నాయక్, ఆంగోత్ సేవులు, చందు, గేమయ్య, జబ్బార్, గోపాల్, ఉన్నారు

17సెప్టెంబర్ విమోచన దినం జరుపుకోవాలి.



మెదక్ జిల్లా -16సెప్టెంబర్ (మహాప్రభ).
భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం మరియు సేవా సంకల్ప్ అభియాన్ పై ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు రావడం జరిగింది. సెప్టెంబర్ 17 నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 17 వరకు 9 సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించడం జరిగింది.సెప్టెంబర్ 17న తెలంగాణ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆపరేషన్ పోలో చేపట్టడం వల్ల మనకి నేడు తెలంగాణ రాడవం జరిగింది అందుకు గాను ఆ రోజు మనం గొప్పగా జరుపుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం ప్రజాసేవ, సంక్షేమ పథకాలు, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యతలను "వికసిత్ భారత్-2047" సంకల్పంతో అమసంధానించడం. ఆశీర్వాదాల దీపం,"25 కోట్ల పిల్లల కలలు",నమో సేవా గాథ,అంగన్వాడీ ఉత్సవాలు, మార్పు కథ,వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, సేవా జ్యోతి యాత్ర, సేవలో నా భాగస్వామ్యం, నదీతీరాల అభివృద్ధి, సేవా సేతు అభియాన్ వంటి కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పదధికారులు మండల పట్టణ అధ్యక్షులు సర్పంచులు కౌన్సిలర్లు మోర్చాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

వ్యాపారస్థులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



నారాయణఖేడ్, -16సెప్టెంబర్ (మహాప్రభ).
ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వ్యాపార సంస్థలు మరియు దుకాణాల తప్పనిసరిగా వృత్తి వ్యాపార లైసెన్సులు మున్సిపల్ కార్యాలయం నుండి తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి తెలిపారు. బుధవారం ఆమె పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపార యజమాని తాము నిర్వహిస్తున్న వ్యాపారానికి సంబందించిన లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలి అన్నారు. వృత్తి వ్యాపార లైసెన్సులు లేకుండా వ్యాపారం లేదా దుకాణం నిర్వహించినట్లయితే నిబంధనల ప్రకారం జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

పాపన్నపేట1104 విద్యుత్ యూనియన్ సబ్ డివిజన్ అధ్యక్షులుగా ఎండీ.సమీర్





పాపన్నపేట, సెప్టెంబర్16(మహా ప్రభ)
పాపన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ 1104 యూనియన్ ఎన్నికలు బుధవారం రోజు పాపన్నపేట మంజీరా గార్డెన్స్ లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి మెదక్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శుల సమక్షంలో నిర్వహించారు. పాపన్నపేట సబ్ డివిజన్ అధ్యక్షులుగా ఎండీ.సమీర్ (ఏఎల్ఏం,పాపన్నపేట), ఉపాధ్యక్షులుగా పి.రవీందర్(ఆర్టిజన్, పాపన్నపేట),కార్యదర్శిగా ఆర్.వనిందర్,ఏఎల్ఏం, పెద్దశంకరంపేట),అదనపు కార్యదర్శిగా కే.మోహన్, ఆర్టిజన్,టేక్మాల్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈకార్యక్రమంలో మెదక్ సర్కిల్ నాయకులు న్యాత ప్రసాద్,విట్టల్,కామారం శ్రీనివాస్,టేక్మాల్ సంగయ్య, డి.శివరాం నాయక్,రవీందర్ గౌడ్,గంట సుదీర్, ప్రశాంత్,ఎండీ.యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ 9వ వార్డులో ఐమాక్స్ లైట్లు మరమ్మతులు చేపట్టిన కౌన్సిలర్.





దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 16 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని 9 వార్డ్ హనుమాన్ నగర్ లో గణేష్ మండపం వద్ద కౌన్సిలర్స్ ముత్యాల రవికుమార్ యాదవ్ ఐమాక్స్ లైట్లు మరమ్మత్ చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో చర్యలు చేపట్టారు.వారి వెంట శానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, గుండాల వెంకట్ యాదవ్, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

-రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశం

-పాయింట్ బుక్‌లను తనిఖీ చేసిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్ జిల్లా -16సెప్టెంబర్ (మహాప్రభ).
గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను ఆయన సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ప్రతి మండపం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. విధుల్లో భాగంగా సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా ఎస్పీ పరిశీలించారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అవసరమైన ప్రాంతాలను పూర్తిగా కవర్ చేసే విధంగా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డియస్పి ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కోలుకున్నాయి. వరుసగా రెండు రోజుల నష్టాల తర్వాత సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ , రియల్టీ , ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు చమురు ధరలు తగ్గడం కూడా మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ 332.63 పాయింట్లు లాభపడి 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. అయితే మార్కెట్‌లో మొత్తం కొనుగోళ్ల జోరు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం స్వల్పంగా తగ్గింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం నష్టపోయింది. రంగాల వారీగా ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ సూచీలు లాభాల్లో ముందున్నాయి. ఐటీ, ఫార్మా సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీకి 23,300-23,400 స్థాయిలో నిరోధం ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 23,500 పైన నిలకడగా ఉంటే సూచీ పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దిగువన 23,100-23,070 స్థాయిని కీలక మద్దతుగా చూస్తున్నారు. 23,070 కిందకు పడితే అమ్మకాల ఒత్తిడి పెరిగి 23,000-22,800 స్థాయిలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయంపైనే మదుపర్ల దృష్టి ఉంది. వడ్డీ రేట్లపై ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో నగదు లభ్యత, పెట్టుబడుల ప్రవాహం, సమీపకాల మార్కెట్ దిశను ప్రభావితం చేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు.

బిజినెస్

బంగారం ధరలకు స్వల్ప పెరుగుదల



హైదరాబాద్:
దేశీయ బులియన్ మార్కెట్‌లో బుధవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పెట్టుబడిదారుల కొనుగోళ్లు, మార్కెట్‌లోని డిమాండ్ వంటి అంశాల ప్రభావంతో పసిడి ధరల్లో కాస్త పెరుగుదల నమోదైంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ధరలు మరోసారి పైకి కదిలాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర బుధవారం రూ.250 పెరిగింది. దీంతో 10 గ్రాముల పసిడి ధర రూ.1,40,650కు చేరుకుంది. ఇదే సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.270 పెరిగి రూ.1,53,470కు చేరింది. వరుసగా స్వల్ప హెచ్చుతగ్గులు కనిపిస్తున్నప్పటికీ పసిడి ధరలు ప్రస్తుతం అధిక స్థాయిలోనే కొనసాగుతున్నాయి. మరోవైపు వెండి ధరల్లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు పెరగ్గా, వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉన్నట్లు మార్కెట్ గణాంకాలు సూచిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ బంగారం, వెండి ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే నగరాలు, ప్రాంతాలను బట్టి ఆభరణాల తయారీ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర స్థానిక పన్నుల కారణంగా వినియోగదారులు చెల్లించే తుది ధరలో స్వల్ప తేడాలు ఉండొచ్చు. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌తో పాటు పెట్టుబడి అవసరాల నేపథ్యంలో బంగారానికి దేశీయంగా డిమాండ్ కొనసాగుతోంది. ధరలు మరింత పెరుగుతాయా, లేక కొంతకాలం స్థిరంగా ఉంటాయా అన్నది అంతర్జాతీయ మార్కెట్ కదలికలు, రూపాయి మారకం విలువ, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

భారీగా పెరిగిన ఉల్లిపాయల ధరలు

హైదరాబాద్
ఉల్లిపాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యుల వంటింటి బడ్జెట్‌పై భారం పెరుగుతోంది. కొద్దిరోజులుగా మార్కెట్‌లో ఉల్లి ధరలు క్రమంగా పైకి కదులుతుండటంతో గృహిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ధరలు గణనీయంగా పెరగడంతో రోజువారీ వంటల్లో తప్పనిసరిగా ఉపయోగించే ఉల్లిపాయను కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది రోజుల క్రితం వరకు కిలో ఉల్లిపాయల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉండగా, ప్రస్తుతం మంచి నాణ్యత కలిగిన ఉల్లి ధర కిలోకు రూ.70 నుంచి రూ.80 వరకు చేరింది. తక్కువ నాణ్యత కలిగిన ఉల్లిపాయలు కొంత తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ, నాణ్యమైన ఉల్లికి మాత్రం



మార్కెట్‌లో అధిక ధర పలుకుతోంది. దీంతో గతంతో పోలిస్తే వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఉల్లిపాయల ధరలు పెరగడంతో కూరగాయల కొనుగోళ్లలో గృహిణులు బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు ఉల్లి ధరల పెరుగుదల మరింత భారంగా మారింది. మార్కెట్‌కు వెళ్లిన పలువురు వినియోగదారులు ధరలు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల సరఫరా, మార్కెట్‌లో లభ్యత, డిమాండ్ తదితర కారణాల ప్రభావంతో ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. రానున్న రోజుల్లో సరఫరా మెరుగుపడి ధరలు తగ్గుతాయా, లేక మరింత పెరుగుతాయా అన్నది చూడాల్సి ఉంది. ధరలు నియంత్రణలోకి వచ్చి సామాన్యులకు అందుబాటులోకి రావాలని వినియోగదారులు కోరుతున్నారు.

రోహిత్ శర్మ రికార్డును అధిగమించిన బట్లర్

స్పోర్ట్స్

లండన్:
ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ టీ20 క్రికెట్‌లో మరో అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంకతో సౌతాంప్టన్‌లో మంగళవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో బట్లర్ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 119 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో బట్లర్ తనదైన శైలిలో చెలరేగాడు. కేవలం 44 బంతుల్లోనే 80 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతని అంతర్జాతీయ టీ20 పరుగుల సంఖ్య 4,292కు చేరింది. ఇప్పటివరకు 161 మ్యాచ్‌ల్లో బట్లర్ ఈ పరుగులు సాధించాడు. దీంతో 4,231 పరుగులతో రెండో స్థానంలో ఉన్న రోహిత్ శర్మ రికార్డును అతను అధిగమించాడు. టీ20ల్లో బట్లర్ 34.33 బ్యాటింగ్ సగటుతో పరుగులు సాధించాడు. అతని ఖాతాలో రెండు సెంచరీలు, 29 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇంగ్లండ్ తరఫున టీ20 ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన బ్యాటర్లలో ఒకడిగా కొనసాగుతున్న బట్లర్.. తాజాగా మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక శ్రీలంకతో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ కెప్టెన్



హ్యారీ బ్రూక్ కూడా విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 49 బంతుల్లోనే 114 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. బట్లర్, బ్రూక్ కలిసి రెండో వికెట్‌కు 128 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ భారీ స్కోరు సాధించి శ్రీలంకపై ఘన విజయం అందుకుంది. అత్యధిక పరుగుల జాబితాలో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ 4,596 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతని టీ20 బ్యాటింగ్ సగటు 38.94గా ఉంది. ప్రస్తుతం 4,292 పరుగులతో రెండో స్థానానికి చేరుకున్న బట్లర్.. అగ్రస్థానంలో ఉన్న బాబర్ ఆజమ్‌కు మరింత చేరువయ్యాడు.

వైభవ్ తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే



అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

ఐపీఎల్ 2027 వేలం వేదికపై బీసీసీఐ బిగ్ అప్‌డేట్..!

-భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం
-చివరిసారి 2023లో కేరళలో జరిగిన ఆక్షన్
-ఆ తర్వాత వరుసగా 3 సార్లు విదేశాల్లోనే

గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెద్దా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు.

ఫ్రాంచైజీల కష్టాలు గుర్తించిన బీసీసీఐ
మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన



ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది.

అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం
భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న సస్పెన్స్ మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

విజయ్ సేతుపతి 'బత్తా' టీజర్ విడుదల..

- వింటేజ్ లుక్‌లో అదరగొట్టిన మక్కల్



కోలీవుడ్ స్టార్ హీరో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తాజా చిత్రం 'బత్తా'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నడువుల కొంచెం పక్కతా కానుమ్మ?', 'సీతకాతి' వంటి విభిన్న చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు బాలాజీ తరుణీధరన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.పూర్తిగా 1960ల నాటి వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ మరియు ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' ఫేమ్ లిజో మోల్ జోస్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల విడుదలైన 'మగలే' అనే తండ్రీకూతుళ్ల భావోద్వేగ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తుండటం విశేషం. విజయ్ సేతుపతి వింటేజ్ లుక్‌లో బీడీ కాలుస్తూ చాలా డిఫరెంట్ స్టైల్‌లో కనిపిస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

మైథలాజికల్ మూవీలో తమన్నా.. ఆసక్తికరంగా 'ది వాన్' ట్రైలర్



స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా హీరో సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది వాన్'. మిస్టరీ, హారర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్ మరియు టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, అరుణాభ్ కుమార్, మరియు నీరజ్ కొఠారి ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.ట్రైలర్ గమనిస్తే.. ఇది కేవలం సాధారణ హారర్ సినిమా కాకుండా, పురాతన నమ్మకాలు మరియు దైవిక శక్తుల ఆధారంగా సాగే ఒక విభిన్నమైన ఫాంటసీ థ్రిల్లర్‌గా కనిపిస్తోంది. ఒక ఆధునిక భావాలున్న పట్టణ యువకుడు (సిద్ధార్థ్ మల్హోత్రా) తన పూర్వీకుల గ్రామంలోని ప్రవేశ నిషేధమున్న ఒక రహస్య అడవిలోకి ప్రవేశించి, అక్కడ ఒక దివ్యమైన శక్తిని లేదా అదృశ్య రూపాన్ని మేల్కొలపడం వంటి అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. దీనివల్ల వారు ఎదుర్కొనే ఊహించని భయానక పరిణామాలు, ప్రమాదకర పరిస్థితులు ఏంటి అనేది ఈ సినిమా కథ. సినిమాలో తమన్నా పాత్ర అత్యంత కీలకమైందిగా తెలుస్తోంది. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ, అనుప్ సోని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. భారీ విజువల్స్, ఉత్కంఠభరితమైన మలుపులతో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది

వరుస విజయాలతో బాక్సాఫీస్ క్వీన్‌గా మమిత బైజు..

ఏడాదిలోపే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం!



మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా అంతటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో మమిత బైజు ఒకరు. గడిచిన ఏడాది కాలంలో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఏకంగా రూ. 1000 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను దాటడం విశేషం. కేవలం సహజమైన నటనతోనే కాకుండా తనదైన ప్రత్యేక శైలితో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ యంగ్ హీరోయిన్, ప్రస్తుతం సౌత్ సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ నటిగా దూసుకుపోతున్నారు.కేరళలోని కొట్టాయంకు చెందిన మమిత బైజు 2016లో విడుదలైన 'పావడ' చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించినప్పటికీ, 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ చిత్రంలోని 'రీను' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో కూడా ఆమె బలమైన స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. ఇక గత ఏడాది కాలంలో మమిత బైజు నటించిన సినిమాల బాక్సాఫీస్ సునామీ చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విజయ్ సరసన నటించిన సినిమా ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, ప్రదీప్ రంగనాథన్‌తో చేసిన చిత్రం రూ. 100 కోట్లు రాబట్టింది. అలాగే సూర్య నటిస్తున్న 'విశ్వనాధ్ అండ్ సన్స్' చిత్రం రూ. 260 కోట్లు, ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా రూ. 55 కోట్లు సాధించాయి. మరోవైపు థియేటర్లలో దూసుకుపోతున్న 'బెల్లహోమ్ కుటుంబ యూనిట్' ఇప్పటికే రూ. 310 కోట్లకు పైగా వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఇలా కేవలం 12 నెలల వ్యవధిలోనే ఆమె నటించిన చిత్రాలు సుమారు రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి, ఎంతో ఆత్మవిశ్వాసంతో నటించడంలో మమిత బైజు దిట్ట. ఏ పాత్రను ఎంచుకున్నా దానికి పూర్తి న్యాయం చేయడం ఆమె ప్రత్యేకత. అందుకే రోజురోజుకూ ఆమెకు ఫ్యాన్ ఫాలోవర్స్ భారీగా పెరిగిపోతున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న మమిత బైజు రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

వారణాసి' కథలో అదే కీలకం!



మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' సినిమాపై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. టైమ్ ట్రావెల్, మైథాలజీ అంశాలను కలబోసి అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో మహేశ్‌బాబు శివ భక్తుడు రుద్ర పాత్రలో కనిపించనున్నారు. రామాయణ కాలం నాటి ఘట్టాలు కథలో కీలకంగా ఉండబోతున్నాయి.తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. క్రీ.పూ 7000 సంవత్సరాల క్రితం మొదలయ్యే ఈ కథ వర్తమానం వరకు వివిధ కాలాల్లో పయనిస్తూ సాగుతుందని తెలిసింది. అయితే ఈ సినిమాలో టైమ్ ట్రావెల్‌కు ప్రత్యేకమైన మిషన్‌లాంటిది ఏదీ ఉండదని, కాలాన్ని దాటి వేల సంవత్సరాల చరిత్రలోకి కథానాయకుడు ఎలా వెళ్లాడనే అంశమే అత్యంత ప్రధానంగా ఉంటుందని చెబుతున్నారు. పురాణాలు, చరిత్ర, భవిష్యత్తును అనుసంధానించిన ఈ కథలో ప్రేక్షకుల్ని అబ్బురపరిచే అంశాలెన్నో ఉంటాయని సమాచారం. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు చిత్ర ప్రధాన తారాగణం.

తెలుగులో మరో బంపరాఫర్



అగ్ర కథానాయిక శ్రీలీలకు వరుసగా అవకాశాలైతే వస్తున్నాయి కానీ..విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది.వశిష్ఠ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నాయి. త్వరలో లాంచ్ కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి పలువురు యువ నాయికల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు శ్రీలీలను ఓకే చేశారని అంటున్నారు. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్ 'ఓం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అలాగే హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ చిత్రంలో నటించనుంది.

ప్యారడైజ్ బిర్యానీలా అద్భుతంగా ఉంటుంది

'నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. దర్శకనిర్మాతలు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని శాయశక్తుల కృషి చేశాను' అన్నారు సంపూర్ణేష్‌బాబు. నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్'లో బిర్యానీ అనే ఇంట్రెస్టింగ్ పాత్రలో కనిపించనున్నారు సంపూర్ణేష్‌బాబు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో తాను నాని ఫ్రెండ్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, కథాగమనంలో తన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు.ఆయన మాట్లాడుతూ 'మూడు సంవత్సరాల క్రితం ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్‌లో కొన్ని మిస్టేక్స్ జరిగేవి కావు. నానిగారితో పనిచేయడం చాలా కంఫర్టబుల్‌గా అనిపించింది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా' అన్నారు. ఈ సినిమా కోసం తాను బరువు తగ్గానని, జుట్టు..గడ్డం కూడా పెంచానని సంపూర్ణేష్‌బాబు పేర్కొన్నారు. ప్యారడైజ్ బిర్యానీ ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ సినిమా అంతే అద్భుతంగా ఉంటుందని, రెమ్యునరేషన్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉన్నానని సంపూర్ణేష్‌బాబు తెలిపారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com